
కథ



# నమో వెంకటేశ

- ఎ.ఆర్. స్వామి

**అబ్బాయి** ఇంజనీరింగ్ చదువు పూర్తయింది. నేను తిరుపతి వెంకటేశ్వర స్వామి దర్శనానికి పెళ్ళాం పిల్లలతో వెళ్దామనుకున్నాను. రైలు రిజర్వేషన్ చేయించాలి. మా ఆవిడ భాగ్యం, " ఏమండీ! వచ్చేవారం తిరుపతి వెళ్దామనుకుంటున్నాం కదా! రిజర్వేషన్ ఏర్పాటు చూస్తున్నారా? కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో పగటి ప్రయాణం చేయించి మా వళ్ళు హూనం చేస్తే నేనొప్పుకోను. నేను పిల్లలు ఆ కృష్ణాలో రాలేం. అది చెట్టుకీ పుట్టకీ ఆగిపోతుంటుంది...." "సరేలేవే! 'నారాయణాద్రి'లో వెళ్దాం."

మా ఆవిడ పోరు పడలేక 'నారాయణాద్రి'లో నాలుగు బెర్త్‌లు రిజర్వ్ చేయించాను. స్లీపర్ క్లాస్ టికెట్‌కి, సెకెండ్ క్లాస్ సిట్టింగ్ టిక్కెట్‌కీ ఖరీదులో తేడా ఎక్కువగా ఉండటంతో, సెకెండ్ క్లాస్ సిట్టింగ్ ప్రయాణం పై మొగ్గు చూపడం నాలాంటి మధ్య తరగతి వాడికి సహజమే! డబ్బు సమస్య లేకపోతే నాకు మాత్రం స్లీపర్ క్లాస్‌లో బెర్త్ రిజర్వ్ చేయించుకుని హాయిగా పడుకుని వెళ్ళాలని ఉండదా ఏమిటి?

0-0-0

నారాయణాద్రి సికిందరాబాద్‌లో సాయంత్రం బయలుదేరి ఉదయానికల్లా తిరుపతి చేరింది. తిరుపతి చేరిన మరుక్షణం నుండి నాలో టెన్షన్ మొదలయ్యింది. తిరుపతిలో స్వామి దర్శనం ఎన్ని రోజులు, ఎన్ని గంటల తరువాతవుతుందో? సుదర్శన పట్టీ వేయించు కోవడానికి మేం సామాన్లతో సహా ఎన్ని గంటలు 'క్యూ'లో నిలబడాలో! మూడు రోజుల తరువాత రిటర్న్ జర్నీకి రిజర్వేషన్ చేయించుకున్నాం. ఈలోపు తిరుమలలో స్వామి దర్శనం, అలివేలు మంగాపురం, గోవిందరాజస్వామి, శ్రీనివాస మంగాపురం దేవాలయాల్లో దైవదర్శనాలు ముగించుకుని రిటర్న్ జర్నీ సమయానికి, తిరుపతి వెనక్కి రాగలమా? లేదా? ఇలా వేగంగా పరుగెడుతున్న ఆలోచనలతో నా బుర్ర వేడెక్కింది.

మేమందరం సుదర్శన పట్టీ వేయించుకున్నాం. దర్శనం మర్నాడు సాయంత్రానికి. ఇంకేం, అందరం తిరుమల కొండపైకి 'నీవుండేదాకొండపై.... నేనుండేదీ నేలపై' అని పాడుకుంటూ బస్సు ప్రయాణానికి సిద్ధమయ్యాం. ఆర్.టి.సి ధర్మమా అని ఇదివరకట్లా కాక, కొండపై ప్రయాణానికి బస్సులు తిరుపతిలో పలు ప్రాంతాల నుంచి బయలుదేరుతూండటంతో, రైల్వేస్టేషన్‌కి ఎదురుగానే తిరుమలకి బస్సు దొరికింది. హమ్మయ్య! అనుకుంటూ నేనూ, భాగ్యం ఒకచోట, పిల్లలిద్దరూ మరోచోట సీట్లలో చతికిల పడ్డాం. మరో గంటలో తిరుమల చేరాం. అసలే రాత్రంతా రైల్లో సరిగా నిద్రలేదు, ప్రయాణబడలికలో వళ్ళు తూలి పోతోంది. అమ్మో! కాటేజీ కోసం మళ్ళీ 'క్యూ' తలచుకుంటేనే నీరసం. తిరుమల వచ్చాక 'క్యూ' ల గురించి భయపడితే ఎలా?.... ఎలాగూ తప్పదు కదా... ఎదురుగా వున్న కాటేజీల కౌంటర్ ముందు 'క్యూ'లో నిలబడ్డాను. చాంతాడంత క్యూ. మెల్లిగా కదులుతోంది. మూడు గంటల శ్రమ ఫలితంగా హెచ్.వి.సిలో ఒక కాటేజీ ఎలాట్ అయింది. మొత్తం మీద అందరం కాటేజీ చేరాం.

0-0-0

మర్నాడు సాయంత్రానికల్లా అందరం ముస్తాబై మరో 'క్యూ' కట్టి వైకుంఠం 'క్యూ' కాంప్లెక్స్ చుట్టి చివరికి గర్భగుడి ప్రాంగణం చేరాం. అక్కడ మెళ్ళో స్కార్ఫ్'లు కట్టుకున్న అనేకమంది వాలంటీర్లు. అమ్మో! వాళ్ళు వాలంటీర్లా ? ... యమభటులా?... మమ్మల్ని జబ్బ పట్టుకుని జరజరా బయటికి ఈడ్చేయడంతో పడిపోకుండా నిలబడ్డానికే కష్టమయింది. అనుకున్నంత సేపు పట్టలేదు స్వామి దర్శనానికై కన్న కలలు... ఊహలు... అసంతృప్తితో

**"ఏమండీ!
వచ్చేవారం తిరుపతి
వెళ్దామనుకుంటున్నాం కదా!
రిజర్వేషన్ ఏర్పాటు చూస్తున్నారా?
కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో పగటి ప్రయాణం
చేయించి మా వళ్ళు హూనం చేస్తే
నేనొప్పుకోను. నేను పిల్లలు ఆ కృష్ణాలో
రాలేం. అది చెట్టుకీ పుట్టకీ
ఆగిపోతుంటుంది."**

రెప్పపాటులో గుడి బయటకొచ్చేశాం. అసలు స్వామి దర్శనమయ్యిందా? లేదా? అన్న అనుమానం కూడా కలిగింది. గర్భగుడిలో జరిగిన హడావుడికి మనస్తాపం చెంది, మర్నాడు అర్చనానంతర దర్శనానికి మా అందరికీ ఎనిమిది వందల రూపాయలిచ్చి టికెట్స్ తీసుకున్నాను. కనీసం ఆ దర్శనమయినా ప్రశాంతంగా సాగాలని దేవుణ్ణి మనసులో పదే పదే ప్రార్థించాను. అయినా.... దేవుడు వరమిచ్చినా..... వాలంటీర్లు వరమివ్వాలిగా....! అప్పుడు కూడా ఉరకలు పరుగులు.... తొక్కిసలాట..... తోపులాట.... వాలంటీర్ల పీకులాట..... గర్భగుడిలో కిందనేల కొంత తడి తడిగా ఉండటంతో, ఆ కుమ్ములాటలో కాలుజారి కిందపడ్డాను. మోచేతి చిప్పకి రాతి గోడ తగిలి గాయమైంది. తలో రెండొందలూ వదిలినా, సుఖం దక్కలేదు. ఏ వి.ఐ.పినో అయ్యుంటే సకల మర్యాదలతో స్వామి దర్శనమయ్యుండేది కదా! ఈ తోపులాటలకి.... కుమ్ములాటలకీ కారుకులైన సంబంధిత సిబ్బందినీ, అధికారుల్నీ మనసులో తిట్టుకున్నాను. మనసంతా చికాగ్గా ఉంది. స్వామికి దూరం నుండే ఒక దణ్ణం పడేసుకుంటే సరిపోతుంది. ఇంత డబ్బు ఖర్చు చేసుకుని ఇన్ని పాట్లు దేనికి? ఇంతకన్నా ఏదైనా సమాజ సేవ చేయడం మేలేమో?

0-0-0

మర్నాడు తిరుపతి చేరి నేనూ, మా ఆవిడా, పిల్లలూ అలివేలు మంగాపురానికి ఆటోలో బయల్దేరాం. అక్కడా పరిస్థితి మామూలే. ఆర్జితసేవలు.... శీఘ్రదర్శనాలు.... వి.ఐ.పి. విజిట్లు..... ఏవో ప్రత్యేక పూజలు. ఆలయమంతా హడావుడిగా వుంది. ఎలాగో తంటాలుపడి అమ్మవారి దర్శనం కూడా అయ్యిందనిపించాం. అక్కడ నుండి శ్రీనివాస మంగాపురంలోని శ్రీకళ్యాణ శ్రీనివాసుని దర్శనానికి ఆటోలో బయల్దేరాం.

ఆహా!.... ఎంత తేడా!..... ఎంత ప్రశాంతత.... ఎంత హాయి..... కుమ్ములాటల్లేవు. వాలంటీర్ల గుంజులాటల్లేవు. జనం రద్దీ లేదు.... తొక్కిసలాటలేదు. ఉన్నదల్లా ప్రశాంత వాతావరణం. హాయి... ఆనందం.... అప్రయత్నంగా కళ్ళు చెమర్చాయి. మా వాళ్ళ ముఖాల్లోకి చూశాను. వాళ్ళ ముఖాల్లో ఎంతో రిలీఫ్ కనిపించింది. గర్భగుడిలో ఎదురుగా శోభాయమానంగా ఉన్న నిలువెత్తు కళ్యాణ శ్రీనివాసుణ్ణి తనివితీరా కనులారా చూసి తన్మయత్వం చెందాను. ఆలయ ప్రాంగణంలో కొంతసేపు సేదతీర్చుకుని నల్గురం స్వామి ప్రసాదం తిన్నాం. తిరుగు ప్రయాణానికి సిద్ధమయ్యాం.

నాకనిపించింది అసలు గుడికెందు కెళ్తాం? ఈ బాహ్య ప్రపంచంలోని చింతల నుండి, కొంత సమయాన్ని భక్తితో భగవన్నామ స్మరణం చేసుకుంటూ ప్రశాంతంగా గడపాలనే కదా! మరి అటువంటి అవకాశం ఎప్పుడూ రద్దీగా ఉండే దేవాలయాల్లో మనకి లభిస్తోందా? తిరుపతి చేరినప్పటి నుంచి, తిరుగు ప్రయాణం గురించి ఆలోచనా చింతే గాని కొంత భక్తితో కొంత సహనంగా వ్యవహరించే అవకాశం ఉంటోందా.... ?

దూరంగా ఎక్కడ నుండో మైకులో పాట వినిపిస్తోంది,

నీవుండేదా కొండపై.... నా స్వామి ... నేనుండేదీ నేలపై.... ఏ లీలా సేవింతునో నా స్వామీ.... ఏ పూల పూజింతునో..... దూరానా నైనా కనే భాగ్యమీవా......

రంజని నిర్వహించిన రాయప్రోలు రామకృష్ణయ్య స్మారక ఉగాది కథల పోటీలలో తృతీయ బహుమతి పొందిన కథ.